# పీడిత ప్రజా ఉద్యమ నాయకులు
# కామ్రేడ్ అంగడి చెన్నయ్య, కొప్పుల కోటయ్యల వర్ధంతిసభలు



వర్ధంతిసభలో ప్రసంగిస్తున్న కా॥ గుర్రం విజయకుమార్

**అమరులు** కామ్రేడ్స్ అంగడి చెన్నయ్య, కొప్పుల కోటయ్యల వర్ధంతి సభ 2022 డిసెంబర్ 1న గుంటూరులోని కామ్రేడ్ అంగడి చెన్నయ్య స్థూపం వద్ద జరిగింది. ఈ సభకు **సి.పి.ఐ.(ఎం-ఎల్) జిల్లా నాయకులు కామ్రేడ్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు** అధ్యక్షత వహించారు. సభలో ముందుగా **పార్టీ కేంద్ర కమిటి సభ్యులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్** మాట్లాడుతూ, అమరులకు జోహార్లు అర్పిస్తున్నామంటే - వారి కర్తవ్యాలను గుర్తుచేసుకుంటూ, వారి కార్యకలాపాలను కొనసాగిస్తూ; వారి ఆశయాలను నెరవేరుస్తామని నిర్ణయం తీసుకోవడమేనన్నారు.

“ధరలు పెరుగుతూ జనం ఉద్రిక్తతలకు లోనవుతున్నారు. కుబేరులు పెరుగుతున్నారు. కోవిడ్ కాలం నుండి ఎగుమతులు తరుగుతూ దిగుమతులు పెరుగుతూ రూపాయి విలువ పడిపోతున్నది. ఆత్మనిర్భర ఘనత, 75 సం॥రాల స్వాతంత్ర్య పరిస్థితి ఇది. మన ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. 260 కోట్లమందికి తిండి పెట్టగల భూమి ఉంది. కానీ 40 కోట్లమంది అర్ధాకలితో ఉంటున్నారు.

పారిశ్రామిక విప్లవాల కాలంలో దున్నేవానికే భూమి కార్యక్రమం అనేక దేశాల్లో సాగింది. ‘దున్నేవానికే భూమి’ దక్కించుకునేందుకు విప్లవోద్యమం నిర్మించుకోవాలి. కార్మిక కర్షక రాజ్యం ఏర్పరచుకోవాలి. అది కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాధించుకోవాలి. నగ్జల్బరి, శ్రీకాకుళ ఉద్యమాలు, పోరాటాలు జరిగినా భూపంపిణీ కర్తవ్యం పూర్తికాలేదు. ప్రజల్ని నిరుద్యోగ భూతం ఆవరించింది. వ్యవసాయ సంస్కరణలు, పారిశ్రామిక ఏర్పాట్లు జరగలేదు. పాలకుల మధ్య లడాయి అభివృద్ధి జరగలేదని తెలియజేస్తున్నది.

ఉద్యోగం, ఉపాధి కల్పించకుండా మత, కుల ఉద్రేకాన్ని రెచ్చగొడుతున్నారు. పాలకులు ఫాసిస్టు తరహా పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. వాటిని ఎదుర్కోవాలి. అమర కామ్రేడ్స్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించడానికి ముందుకు సాగడమే వారికి అర్పించే నిజమైన నివాళి’ అని ఆయన తన ప్రసంగం ముగించారు.

**సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఎస్. ఝాన్సీ** మాట్లాడుతూ కామ్రేడ్స్ మరణించి ఎన్నో సంవత్సరాలు గడిచినా, మన మనస్సుల్లో జీవించే వున్నారన్నారు. “చెన్నయ్యన్న ఆనాడు తన పార్టీని మన పార్టీతో విలీనం చేసాడు. ఆ కామ్రేడ్‌ను హత్యచేయటం వలన ఎంత నష్టం జరిగిందో చెప్పాం; ప్రచారం చేసాం. ఆ కామ్రేడ్ ఆశయాన్ని ముందుకు తీసుకుపోతున్నాం. మహత్తర శ్రీకాకుళ పోరాటానికి ఈ జిల్లా నుంచి వెళ్ళారు. పీడిత ప్రజా ఉద్యమాలలో శ్రామిక శ్రేయోరాజ్యం కోసం మరణించారు. ఆ ఆశయాలకు వారసులం మనం.

కోరన్న, మంగన్నల 52వ వర్ధంతిసభ ఈ మధ్యనే జరిగింది. ఆ కామ్రేడ్స్‌ను చాటుమాటుగా కాల్చి చంపారు. ఇన్నేళ్ళ తర్వాత ఆ కామ్రేడ్స్‌ను, అమరులను స్మరించు కుంటున్నామంటే మరో అడుగు ముందుకు వెళ్ళడానికే. ఈనాడు అధికారంలో వున్న పార్టీలన్నీ దోపిడీవర్గ అనుకూల పార్టీలే. అందరికీ ఆరోగ్యం, విద్య, వసతి సౌకర్యాలు ఉన్నాయా? ఆత్మగౌరవంతో బతకగలుగుతున్నారా? నిరుద్యోగ సమస్య ఎందుకు నానాటికీ తీవ్రమౌతుంది?! పబ్లిక్ సెక్టార్ ఎందుకు మూతపడుతోంది? ఈ సమస్యలకు మూలం ఏమిటనేది ఏ

పాలక పార్టీ చెప్పదు; మాట్లాడదు. జి.యస్.టి., పెద్దనోట్ల రద్దు, మూడు నల్లచట్టాలు లాంటివాటితో ప్రజల్ని మరింత దోపిడీచేస్తూ ప్రజల శక్తి సామర్థ్యాలను హరించివేస్తున్నారు. ప్రజలను చైతన్యపరుస్తూ విప్లవోద్యమానికి సంసిద్ధం చేయడమే ప్రధాన కర్తవ్యంగా మనమందరం ముందుకు సాగడమే అమరులకు అర్పించే నిజమైన నివాళి అని కామ్రేడ్ ఝాన్సీ పేర్కొన్నారు.

**సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ డి.వి.యస్. స్వామి, సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కామ్రేడ్ యం.యస్. నాగరాజు,** కామ్రేడ్ అంగడి చెన్నయ్య, కొప్పుల కోటయ్యల కృషిని త్యాగాన్ని వివరించారు.

## నందిగామ, 3-12-22 :

విప్లవ కమ్యూనిస్టు నాయకుడు, రైతుకూలీ ఉద్యమనేత, అమరుడు కామ్రేడ్ కొప్పుల కోటయ్య 5వ వర్ధంతిసభ ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 3-12-22న ఓ.సి.క్లబ్‌లో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు కా॥ ఎం. రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో **రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ** ముందుగా కా॥ కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడుతూ – 80 సంవత్సరాల జీవితంలో 65 సంవత్సరాలు పీడిత ప్రజల విముక్తి కోసం కామ్రేడ్ కోటయ్య కృషిని సాగించారని, ప్రజా ఉద్యమాలలో పూర్తిగా దిగబడి పనిచేశారని గుర్తుచేశారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుంచి ప్రారంభమైన ఆయన రాజకీయ జీవితం తుదిశ్వాస వరకు తరిమెల నాగిరెడ్డి గారి ప్రజా ఉద్యమ పంథాలో నిలిచారని అన్నారు. తరిమెల నాగిరెడ్డి గారి కుట్రకేసులో కా॥ కోటయ్య కూడా నిర్బంధాన్ని ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.

ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులను ప్రస్తావిస్తూ మోడీ, చంద్రబాబు, జగన్ వీరందరూ ఈనాడు రైతుల కోసమే ఎన్నో పథకాలు తెస్తున్నామని అంటున్నారని, రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని అంటున్నారని, కానీ రైతుల ఆత్మహత్యలను ఆపలేకపోతున్నారని వివరించారు. నరేంద్రమోడీ మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చాడు. గిట్టుబాటు ధరల నిర్ణయాన్ని కంపెనీలకు అప్పచెప్పేసాడు. వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దుచేశాడు. ఢిల్లీ సరిహద్దుల్లో సంవత్సర కాలం పైగా రైతులు ఈ చట్టాలను రద్దుచేయాలని ఆందోళన చేశారు. చివరికి ఈ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నానన్నాడు. కానీ అప్పటికే ఈ చట్టాలు దేశంలోని అనేక రాష్ట్రాల్లో వివిధ రూపాల్లో అమల్లోనే వున్నాయనే సంగతిని రైతులు అర్థం చేసుకోవాలని కోరారు.

చైతన్యం కలిగిన రైతులు తమ భూములను కాపాడుకోవడానికి, పాలకుల విధానాలపై కమ్యూనిస్టు పార్టీ ఇచ్చే చైతన్యంతో ముందుకు వచ్చి సంఘటితంగా పోరాడితే తప్ప న్యాయం జరగదని, ఇటువంటి పోరాటాలలో ముందుకు సాగటమే అమరులందరికీ మనమిచ్చే నివాళి'' అని ముగించారు.

తర్వాత **స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు కా॥ చల్లపల్లి విజయ, నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి సాంబశివరావు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కోశాధికారి ఆవుదొడ్డి నాగమల్లేశ్వరి** తదితరులు మాట్లాడారు.

* * * * *